క్లుప్తంగా

పొన్నూరులో పోలీసు కవాతు



పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని షరాఫ్ బజార్, కసుకర్రు రోడ్డు, పాత పొన్నూరు, అంబేడ్కర్ కాలనీ, నేతాజీ నగర్, వ్యూవర్స్ కాలనీలలో సీఐ పి.భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు, కేంద్ర బలగాలు రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని విధాల సహకరించాలని సీఐ ప్రజలను కోరారు. ఎన్నికలలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

అవగాహనతో టీబీ నివారణ సాధ్యం



పొన్నూరు: టీబీ మందులను ఆరు నెలల పాటు సక్రమంగా వాడటంతో పాటు పోషకాహారం తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చని పొన్నూరు క్షయ నివారణ విభాగం వైద్యాధికారి డాక్టర్ అబ్రహం లింకన్ అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా నిడుబ్రోలు సీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించి ప్రజలకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం టీకాను అందిస్తుందని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా క్లై పరీక్ష చేయించుకొవాలని సూచించారు. డాక్టర్ ఫిరోజ్, టీబీ విభాగం సూపర్‌వైజర్ షేక్ చాందిని, జి.శ్రీనివాసరావు, కె.మురళీ పాల్గొన్నారు.

నేడు పొన్నూరులో అంబటి ప్రచారం

పొన్నూరు: వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 8వ వార్డులో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని పార్టీ కార్యాలయం వర్గాలు తెలిపాయి. సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కమనీయం..ఆదికేశవ స్వామి కల్యాణం



చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. అతి పురాతనమైన ఆదికేశవ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఫణిహారం శ్రీధర్ ఆధ్వర్యంలో వార్షిక శాంతి కల్యాణోత్సవంను ఘనంగా నిర్వహించారు. శ్రీ భూ నీళా రాజ్యలక్ష్మి సమేత ఆదికేశవ స్వామి వార్షిక శాంతి కల్యాణోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రాల సాక్షిగా ముత్యాల తలంబ్రాలు, బాజాభజంత్రీల నడుమ స్వామి వారి కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చేబ్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- వేజండ్లలో ఇంటింటి ప్రచారం



వేజండ్లలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

వేజండ్ల(చేబ్రోలు): ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న చర్చిలలో ప్రార్థనలు చేశారు. ఆయా చోట్ల మహిళలు హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. వేజండ్లలో ఉదయం నుంచి రాత్రి వరకు స్థానిక నాయకులతో కలిసి అంబటి మురళీకృష్ణ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రచారాన్ని స్వాగతిస్తూ బ్రహ్మరథం పట్టారు. వేజండ్ల బొమ్మగుంట సెంటర్‌లో జరిగిన సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ పాలన అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింప చేస్తున్నారని తెలిపారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నట్లు వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటికే పథకాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలు జగనన్నకు కొండంత బలమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర ప్రజల కోసం చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పెత్తందారి వ్యవస్థను నరేంద్ర కొనసాగిస్తున్నరన్నారు. తనకు పదవి లేకపోయినా రెండేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని తెలిపారు. నేత్ర వైద్య శిబిరాల ద్వారా వేలాదిమందికి కళ్లజోళ్లు, గుండె వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు, ట్రై సైకిళ్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కర్లపూడి రమేష్, బత్తుల గోవింద రాజులు, కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, కాసు ఈశ్వర రెడ్డి, జువ్వా వీరాస్వామి, ఆళ్ల శ్రీరామిరెడ్డి, బచ్చు బాస్కరరెడ్డి, శనగల వెంకటరెడ్డి, షేక్ పెద మస్తాన్, మోహన్‌రెడ్డి, వేజండ్ల చింతాల్‌బాబు, ముత్తేశ్వరరావు, మగ్బుల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్తులు

జనమంతా జగనన్న వెంటే

- సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం
- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- టీడీపీ, జనసేన నుంచి 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

గుంటూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి జగనన్నే ముఖ్యమంత్రిగా కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని వికాస్‌నగర్‌లోగల తన క్యాంపు కార్యాలయంలో అడవితక్కెళ్లపాడు న్యూ రాజీవ్‌గృహకల్పకు చెందిన 100 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా బలసాని వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసి చూపిన ఏకైక నాయకుడు జగనన్న అని తెలిపారు. ప్రజలంతా జగనన్నను దేవుడుగా కొలుస్తున్నారని జగనన్నకు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని నమ్మి ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను బడుగు బలహీన వర్గాలకే కాకుండా అగ్రవర్ణాల పేదలకు సైతం సంక్షేమ పథకాలు అందించిన ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి అఖండ మెజారిటీతో గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు మన్నవ మహేంద్ర, సుబ్బారావు, సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష కృషి..

రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూశారని కానీ జగనన్న ప్రభుత్వంలో బీసీలు అంటే బ్యాక్‌వార్డ్ క్లాస్ కాదు బ్యాక్‌బోన్ క్యాస్ట్ అని నిరూపించి ప్రతి బీసీ కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను వారి ఇంటిముందుకే అందించాడని ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వికాస్‌నగర్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి లలిత్ ఎమ్మెల్యే అభ్యర్థిని కలిశారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల్లో ఎన్నికల కార్యాచరణ, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థిని బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దాసుపాలెం సర్పంచ్, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్ తదితరులున్నారు.



టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో బలసాని కిరణ్‌కుమార్

అంతా మా ఇష్టం!

- ప్రత్తిపాడు నియోజకవర్గంలో నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు టీడీపీ సమావేశాలు
- ఈసీ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న నేతలు
- అనుమతులు లేకున్నా ప్రచారాల్లో బైక్ ర్యాలీలు, బాణ సంచాలు, డీజేలతో ఆర్భాటాలు
- ఆర్ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ ఏంచేస్తుందని చర్చించుకుంటున్న ప్రజలు



ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అనుమతులు లేకుండా టీడీపీ నేతలు నిర్వహిస్తున్న సమావేశం

గుంటూరు రూరల్: అంతా మా ఇష్టం.. మేం చేసేది మీరు చూస్తూ కూర్చోవటమే.. ఈసీ ఆదేశించినా మా ఇష్టం వచ్చినట్లు మేం చేస్తాం అన్నట్లుంది ప్రత్తిపాడు నియోజవర్గ తెలుగు దేశం పార్టీ నేతల శైలి. ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ, ఇష్టం వచ్చినట్లు ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకున్నా ర్యాలీలు, డీజేలు, విచ్చలవిడిగా డబ్బు పంపిణీలు చేయడమే కాకుండా, బాణ సంచాలు పేల్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు చెప్పుకొంటున్నారు.

■ గుంటూరు వెస్ట్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత తమ సమావేశాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోగల ఒక కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. కనీసం నియోజకవర్గంలోని అధికారులు, పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే సమావేశం జరిగిందని అటు నల్లపాడు పోలీసులు, గుంటూరు వెస్ట్ నియోజకవర్గం ఎన్నికల అధికారులే చెబుతుండడం గమనార్హం. ఇదంతా ఒకెత్తయితే సమావేశం జరుగుతుండగా కల్యాణ మండపం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఒక వ్యక్తి గిలగిల కొట్టుకుంటూ పడిపోయాడు. దీంతో సమావేశంలోని టీడీపీ నాయకులు పరుగున బయటకు వచ్చి కల్యాణ మండపం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీరా చూస్తే అతను ఫిట్స్ కారణంగా పడిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. ఇలా గుట్టు చప్పుడు కాకుండా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలపైకి తెస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడికి చేరిన నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ కనీసం అనుమతులు లేకుండా ఎలా సమావేశం నిర్వహిస్తున్నారని నాయకులను ప్రశ్నిస్తే ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారని తెలిసింది.

■ ఇదేవిధంగా గత రెండు రోజుల క్రితం ప్రత్తిపాడు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో సమావేశం నిర్వహిస్తున్నామని అనుమతులు తీసుకుని గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామంనుంచి స్థానిక నాయకులతో ఎన్‌హెచ్ 16 హైవేపై భారీ ర్యాలీలు, డీజేలు, బాణా సంచాలను పేల్చుతూ ప్రచారం నిర్వహించారు. హైవేపై ఎన్నికల ర్యాలీ చేపట్టటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని సమాచారం. విషయం తెలిసి అక్కడే ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ యనమదల చేరుకుని అనుమతులు లేకుండా డీజేలు ఎలా నిర్వహిస్తారని డీజేలను నిలిపేసినట్లు సమాచారం.

■ అదేవిధంగా గత నాలుగు రోజులు క్రితం వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామంలో అనుమతులు లేకుండానే సమావేశాలు, డీజేలు, బాణ సంచాలతో టీడీపీ నేతలు మడావుడి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే, పొత్తూరు నాయుడుపేట, ఓబులునాయుడుపాలెం తదితర గ్రామాల్లో సైతం ఇదే తంతుగా టీడీపీ నేతలు కనీస అనుమతులు లేకుండానే ప్రచారాలు చేస్తున్నారు. ఇంత చేస్తున్నా ఎన్నికల అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని జనం చెప్పుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం అమరావతిరోడ్డులో అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులపై స్థానిక ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. కానీ ప్రత్తిపాడు నియోజకవర్గంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల అధికారులను టీడీపీ అభ్యర్థి తాను విశ్రాంత కలెక్టర్‌ను అని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించకుండా ప్రచారాలు చేపట్టినవారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫార్మసీ విద్యార్థులు అంకితభావంతో మెలగాలి



చేబ్రోలు: ఫార్మసీ వృత్తిపై విద్యార్థులు నిజాయితీగా, అంకిత భావంతో మెలగాలని లైలా గ్రూప్ కంపెనీల సీఎండీ గోకరాజు గంగరాజు సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఫార్మాస్యూటికల్ అండ్ అప్లైడ్ సైన్సెస్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల ఫార్మా విజన్-2కే24 రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ ఆదివారం ఘనంగా ముగిసింది. లైలా గ్రూప్ కంపెనీల సీఎండీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించడానికి కృషి, క్రమశిక్షణ, పనిపట్ల నిబద్ధత అవసరం అన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిల కింద రూ.8వేలు, రూ.6వేలు రూ.4వేలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరిగె శివ కుమార్, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ డాక్టర్ పి.మురళీధరన్, టి.గోపాలకృష్ణ మూర్తి, ఎస్.రామచంద్ర శెట్టి, వై.రామచంద్రా రెడ్డి, వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో రెండువర్గాల మధ్య వివాదం

పెదకాకాని: ప్రభుత్వ స్థలంలో చెత్త తొలగించి మురుగునీరు పారుదల అయ్యేలా చూడాలనే అంశంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఇరు వర్గాల మధ్య తోపులాటకు దారి తీసింది. పెదకాకాని దూదేకుల కాలనీ మసీదు పక్కనే ప్రభుత్వ భూమి ఉంది. పక్కనే సంకూరివారిపేట ఎస్సీకాలనీ వాసులు నివశిస్తున్నారు. ఖాళీ స్థలంలో చెత్త, పశువుల వ్యర్థాలు వేయరాదని, తొలగించాలనే అంశంపై ఇరువర్గాల వారు అక్కడికి చేరుకుని వాదనకు దిగారు. సమాచారం అందుకున్న పెదకాకాని సీఐ కె.వీరాస్వామి పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఆదివారం రాత్రి ఆ ప్రాంతానికి మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ రవికాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఎస్టీఎఫ్ టీం, పెదకాకాని పోలీసులతో రాత్రి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం

కాకుమాను(కాకుమాను): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని పుస్తక పఠనం వలన ప్రపంచ జ్ఞానం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం అంటే మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి రోజూ కొంత సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించి అక్కడ లభించి వివిధ రకాల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారిణి సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రతి ఆదివారం శాఖా గ్రంథాలయంలో చదవడం అంటే మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకం పఠనం అలవాటు చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



కాకుమానులో ఈత మట్టలు చేతబూని ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు



అంకిరెడ్డిపాలెంలో మట్టల ఆదివారం ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

కాకుమాను: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే చిన్నారులు ఈత మట్టలకు వివిధ రకాల రంగు రంగుల పూలను అలంకరించి, గ్రామ పురవీధులలో క్రీస్తు నినాదాలు చేస్తు పర్యటించారు. అనంతరం స్థానిక ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయంలో ఏసుక్రీస్తు పుట్టుక, మరణం గురించి వాక్యోపదేశం చేశారు. గత 35 రోజుల నుంచి ఉపవాస ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు రానున్న శుభ శుక్రవారంతో ఉపవాసాలు ముగించనున్నట్లు తెలిపారు.

గుంటూరు రూరల్‌లో...

గుంటూరు రూరల్: క్రీస్తు శ్రమల దినాలను పురస్కరించుకుని మట్టల ఆదివారం సందర్భంగా మండలంలోని గ్రామ గ్రామాన చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్రమల దినాలలో భాగంగా ఉపవాస ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు మట్టల ఆదివారం సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలను నిర్వహించారు. క్రీస్తు స్తుతి గీతాలను ఆలపిస్తూ గ్రామాల్లో పర్యటించి, సువార్త ప్రకటించారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు షోకాజ్ నోటీసులు జారీ

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్నికలకు సంబంధించి అందిన ఫిర్యాదులపై నిర్దేశిత సమయంలోపు స్పందించడంలో జాప్యంపై ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంకు శనివారం నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పటిష్ఠంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.
తూర్పు నియోజకవర్గంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో షిఫ్ట్ రెండో బృందం ఆన్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కారం చేయడంలో జాప్యం చేశారని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పి.ఉమాదేవి, ఎం.ప్రమీల, కె.మహేష్, ఎస్.శ్రీనివాసరావు, వి.ఇందిరలకు 24 గంటల్లో వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు.

వైభవం.. తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవం

కంతేరు నుంచి కొప్పురావూరుకు కుంకుమ బండ్లతో తరలివచ్చిన భక్తులు



లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారికి హారతులిస్తున్న అర్చకుడు శ్రీనివాసరావు



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామివారి ఆలయం



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామివారి తిరునాళ్ల మహోత్సవం కనుల పండువగా జరిగింది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి తిరునాళ్లను పురస్కరించుకుని ఆదివారం ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ పల్లెల మధు, కమిటీ పర్యవేక్షణలో అర్చక స్వామి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం 5 గంటలకు మహాగణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అఖండజ్యోతి ప్రదక్షిణ, అష్టోత్తర శత నామార్చన పూజలు జరిపించారు. ఆలయానికి వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోత్రనామ పూజలు జరిపించుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్ళు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 11 గంటలకు కంతేరు గ్రామం నుంచి ఎండబండ్లపై పుట్టింటి సారెగా పసుపు, కుంకుమలు, పూజా సామగ్రితో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరిపించారు. కనక తప్పెట్లు, పార్వతీ పరమేశ్వరుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, బండెల ఉదయ్‌శంకర్, తదితరులు ఉన్నారు. ఆలయ ప్రాంగణం విద్యుత్‌దీప కాంతులతో కళకళలాడింది.

వైభవంగా శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు, ఆలయ కమిటీ సభ్యులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నిత్య హోమం, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ స్వహస్తాలతో హోమ పూర్ణాహుతి అనంతరం వేల సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. శ్రీవశిష్టాశ్రమం ఉత్తరాధికారి శ్రీ విశ్వంభరానందగిరిస్వామి, శేషాచలాశ్రమం పీఠాధిపతి శ్రీ నిర్వకల్పానందస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సాహితీవేత్తలు యాబలూరి లోకనాథశర్మ, నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి, నారాయణం ప్రసాదాచార్యులు, నోరి నారాయణమూర్తి బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మండవ వెంకట రామయ్య దంపతులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని రోటరీ ఇంటర్నేషనల్ బోర్డు డైరెక్టర్ వడ్లమాని రవి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్లమాని రవి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాల్ని గుర్తించి, అధ్యాపకుల సహకారంతో వాటిని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యావంతులుగా, నైపుణ్యవంతులుగా ఎదిగి, తల్లిదండ్రులతో పాటు చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో వార్షికోత్సవం ఒక మరపురాని ఘట్టమన్నారు. ప్రతి విద్యార్థి కళాశాల నుంచి ఎన్నో మంచి విషయాలను నేర్చుకుని భవితకు పునాది వేసుకుంటారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో హిందూ కళాశాల ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం

పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌లో నివాసం ఉండే చుండూరి నాగరాజు దుస్తులు ఉతికే పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు అధికమై ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల నివాసాల్లో కుటుంబసభ్యులు అడిగినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో నాగరాజు భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.